# సత్యనారాయణ, యమ్మే

నిడమర్తి సత్యనారాయణమూర్తిగారు, బి.ఏ. [సారస్వత సమాజము]

౧

సోమయాజుల సత్యనారాయణ యమ్మే ప్యాసయినాడు. చదువుకొనే రోజుల్లో శ్రద్ధగా తెలివితేటలతో చదవడంచేత యెక్కడా ఫేలుకాకుండా పైకివచ్చాడు. యమ్మే ప్యాసవగానే చెన్నపట్నం కళాశాలలో హిస్టరీపండితుడుగా ప్రవేశించాడు. ఇంగ్లీషుకూడా బాగా వ్రాయగలడు నెలకి రెండువందలివ్వడంచేత భార్యా తనూమాత్రం పొడిలేని యిస్తోకులాగ వుండడంచేతా అవి ఖర్చుపెట్టి హాట్లూ బూట్లూ కొని కిర్రుగా వుండేవాడు. అక్కడ దొరలందరూ స్నేహితులు. పిల్లలికికూడా యీయనంటే మంచిగౌరవము, ప్రేమా వుంది. బాగా చదువు చెపుతాడు. భేషజంలేదు. నెమ్మదిగలవాడు. పిల్లలకింకేమి కావాలి? కిష్టమ్మలాగ నవ్వుతూ కబుర్లుచెపితే తాండవ మాడిపోతారు.

తండ్రి ఛాందసుడైనా, మామగారాహితాగ్ని అయినా సత్యనారాయణ నవీనభావప్రేరితుడు. వీరేశలింగంగారి శిష్యకోటిలోవాడు. విధవావివాహాలన్నా పంచమోద్ధారణమన్నా చెవి కోసుకొనేవాడు. వాళ్లిళ్ల కెళ్లి ఫలహారాలు చెయ్యడంకూడా అప్పుడప్పుడుంది. సీతమ్మ మొట్టమొదటి రోజుల్లో అల్లా చెయ్యకూడదని మందలించేది; కాని ఫలితంలేక వూరుకుంది. ఇత నిల్లా చేస్తాడని తండ్రికీ మామగారికీ తెలిసినా వద్దంటే మి దపడతాడేమోననే భయంతో కిక్కురుమనకుండావూరుకున్నారు. మొట్టమొదటినుంచీ అతనికల్లాంటి స్వాతంత్ర్యము వుంది. వెలీ గిలీ అనే మాటకూడా లేదు. 'అన్నవాళ్లకన్నంతా' అని లోపల్లోపల లెంపలేసు కూరకున్నారు.

సత్యనారాయణకి కలిగిందల్లా ఒకకూతురు ఒకకొడుకూమాత్రమే. కూతురు కమలమ్మకు పదహారేళ్లొంటాయి. స్కూలుఫైనలు చదువుతోంది. ఇంకా వివాహం కాలేదు. చాలా బుద్ధిమంతురాలు. తన చదువేమిటో, తల్లికి పనిసాయము చేయడ మేమిటో తప్ప మరేమీ గొడవలేదు. తల్లి బాగా చదువుకోకపోవడంచేత తాను పేపర్లలో చదివిన విషయాలు వింతలు ప్రతిరోజూ కమల ఆమెకు చెప్పుచుండును. సత్యనారాయణ సాయంత్రం క్లబ్బునుంచి వచ్చేసరికి వంటచేసి సీతమ్మ సిద్ధముగా వుండేది. అప్పుడు వాళ్లందరూ ఏకంగా కూర్చుని భోజనాలుచేసి కొంచెంసేపు కబుర్లు చెప్పుకొనో, కమలచేత సంగీతం పాడించో ఆనందిస్తూ వుండేవారు.

కమల ఇతరగొడవ లేమీలేకుండా చదువుకొనేది. బళ్లోకూడా ఎవరితోనూ స్నేహాలు

లేవు. తరగతిలో బాగుగా చదువు బాలికయగుటచే వారింటికెదురుగా నున్న రామస్వామి అయ్యాంగారి కుమార్తె ఆండాళ్లు కమలతో చదువుకునెందుకు వచ్చేది. ఆండాళ్లు ఇరవైయేళ్ల మనిషి. తండ్రి దివ్యజ్ఞానసమాజికుడు. స్త్రీ స్వేచ్ఛాభిలాషి. అందుచేత తన ఏక పుత్రిక యగు ఆండాళ్లకు వివాహము చేయక చదువు చెప్పించుచుండెను. ఆండాళ్లు తెనుగు బాగా మాట్లాడ గలదు. కలిసిగొట్టు మనిషి. నెమ్మదిగలది. అందుచే సీతమ్మ ఆమెను ఎక్కువప్రేమతో చూస్తూవుండేది. కమలతో కలపి ఆండాళ్లకు కూడా చదువు చెపుతూ వుండేవాడు సత్యనారాయణ. కమల, ఆండాళ్లు అక్కచెల్లెళ్లవలె కలిసివుండేవారు. ఆండాళ్లు కమలతో చదువుకుని ఒక్కొక్కప్పుడు రాత్రులం దక్కడే వుండేది.

౨

ఆండాళ్లు సత్యనారాయణగారింట్లో చనువుగా తిరిగేది. ఆయనకూడా శ్రద్ధ తీసుకొని కూతురుతో కలిపి ఆబిడ్డకు చదువుచెప్పేవాడు. కాని కాలం ఒక్కలాగున వుండదు. చూపుల్లోవుండేమహిమ యేమోగాని సత్యనారాయణ ఆండాళ్లను చూడగానే మారిపోయినాడు. మునుపటి ఉన్నతభావములను మంటగలిపి నిష్కళంకమైన జీవితమును మచ్చపాల్చేసినాడు ఆండాళ్లుకూడావలపువలలజిక్కెను వారి దుర్వర్తనము దాగునని వారభిప్రాయపడ్డారు. కొంతకాలము గోప్యముగానే వుంది.

కాని యొకనాడు కమలమ్మ మేడమీద గదిలోకి ఆండాళ్లకొరకు వచ్చింది. ఆ సమయానికి సత్యనారాయణ ఆండాళ్లకళ్లు వెనకనుంచి మూసి నిలుచున్నాడు. కమలమ్మ తెల్లబోయింది. తండ్రి చర్య కాశ్చర్యపడ్డది. కాని గుట్టుగుంపిల్లవడంచేత తల్లికైనా చెప్పకుండా వూరుకుంది. కళ్లు మూసినంత మాత్రమున హేయముగ ననుమానించుట భావ్యము కాదని యామె తలంపు. మరల కొలది దినములకు సత్యనారాయణ ఆండాళ్లని ముద్దుపెట్టుకొనుచుండగా చూచెను. వ్యాపారము బాగుండలేదని యూహించి యేకాంతముగా ఆండాళ్లని పిలిచి "ఎంత పెద్దవాడైనా వాత్సల్యపూర్వకముగనైనా మగవానికి వనిత యింత చనువిచ్చుట తగనిదని కనుక అట్టి ప్రవర్తనము మెచ్చుకోతగనిదని" చెప్పి కమలమ్మ మందలించింది. ఆండాళ్లు తెల్లబోయి యేమీ జవాబు చెప్పలేదు.

ఆండాళ్లు తమ యింటికి వచ్చుట అరికట్టవలెనని కమల చూచింది. కాని తండ్రి వత్తిడివలన అట్లు జరుగలేదు. అయ్యాంగారి కూతుకు యథాప్రకారంగా వస్తోంది. చేయునదిలేక తన యనుమానమును తల్లి కెరిగించుటే కర్తవ్యమని యాలోచించెను. సీతమ్మ ఆమాటలు వినగానే బాధుకొన్నది. మనిషి అనూయకురాలు. గడుసు పోకడలు లేవు. తనకు చదువు వచ్చినా రాకపోయినా ఇన్నిదినములనుండియు విద్యాధికుడగు భర్త తనయెడల విశ్వాసముతో సంచరించుచుండెను గదా యని పొంగిపోయే సీతమ్మ కీవార్త అశనిపాతమువలె నుండెను. అందుచేత రాత్రి భోజనము చేయుచుండగా కంట నీరెట్టుకుని

'ఏమండీ యిదేమన్యాయం. నన్నిట్లా యేడ్పిం చుట తగవా'యని తన యెఱిగినది చెప్పెను. సత్యనారాయణ జవాబు చెప్పుటకు సిద్ధముగ లేడు. అందుచే కోపగించి భోజనము మాని లేచిపోయెను.

అక్కడనుంచీ రోజురోజూ భార్యాభర్తల పొరపు లతిశయించాయి. సత్యనారాయణకి కూతురి చదువు విషయములో శ్రద్ధతగ్గింది భార్యతో సరిగా మాట్లాడుట మానినాడు. ఆండాళ్లతో ప్రసంగములు బాహాటముగా మొదలుపెట్టెను. చేయునదిలేక తల్లీ కూతురు కూడా ఆవిడతో మాట్లాడడము మానిరి. అది సత్యనారాయణకు మరింత కోపకారణమైనది. ఆపిల్ల విషయమున నేమైన నీసడింపు వాక్యము వినబడితే సత్యనారాయణ కోపగించుకొని తిట్లు కొట్లువరకూ గ్రంథము నడిపేవాడు. అల్లారుంబెల్లిముగాజూచిన భార్యా పిల్లలను సత్యనారాయణ నిష్ఠురముగ జూడసాగెను. వారికి కావలసిన యావశ్యకములను గూడ అతడు సరిగా ఇచ్చుట లేదు. భర్తయందు కలిగిన యీవిచిత్ర పరిణామమునకు సీతమ్మ కడుపు చెరువై పోయినది. ఎదిగినపిల్ల అవివాహితయై యింటనున్నది. 'నా' అన్నవారు లేని అరవఅరణ్యము చెన్నపట్టణము. తండ్రికి వ్రాసే మొగుడల్లరిపాలవుతాడని భయము. ఏమిచేస్తుంది? గుడ్లనీళ్లుగుడ్లను గ్రుక్కుకొని భగవంతునిపై భారమువేసి భర్తచేయు అవమానములను భరించి యూరకొనెను.

## 3

ఒకనాడేంజరిగిందంటే ఆండాళ్లకి మంచి నీళ్లు తెమ్మని కమలతో చెప్పాడు సత్యనారాయణ. ఆపని చెయ్యడం కమలమ్మ కిష్టములేక పోవడంచేత తండ్రిమాటకు జవాబు చెప్పకుండా క్రిందికిపోయి 'అమ్మా! ఆరాక్షసికి మంచినీళ్లు తెమ్మన్నారు బాబయ్యగారు. నేను తీసుకువెళ్లను. నువ్వుకూడా మాట్లాడకుండా వూరుకో' అని అంది. 'ఎందుకే. తీసుకువెళ్లియియ్యి. మళ్లీ ఇదో కారణంగా మాలకూడు చేస్తారు. ఈఅల్లరీ అంగామా ఎందుకూ'అంది సీతమ్మ.'ఇందుకనే ఇల్లాసాగుతోంది. నీమెత్తదనంతోనే ఆయనిల్లా అయినారు వూరుకుందూ' అంది కమలమ్మ.

ఇంతలో పిలుపుమీద పిలుపూ, పిలుపు మీద పిలుపూ వచ్చాయి పైనుంచి. కాని జవాబు వెళ్లలేదు. సత్యనారాయణ దడదడ కోపముతో కిందికిదిగివచ్చి 'కమలా! మంచి నీళ్లేవీ'అని అరిచాడు సత్యనారాయణ. ఇంకా జవాబులేదు. 'నడు' మంచినీళ్లు తే'. కదల్లేదు కమల. 'తేవాలని నీకైనా తెలియదూ?' అని సీతమ్మవంక తిరిగి అంటూండగా ఆవిడ గ్లాసుతో నీళ్లు తెచ్చి 'ఇవిగో తాగండి' అని చేతికిచ్చింది. 'పైకి తెమ్మన్నాను. కమలా రా!' అన్నాడు. కాని ఆపిల్ల కదలలేదు 'ఈ వెధవ అభిమానాలు వదలి చెప్పినట్లు చెయ్యి. పైకి తీసుకు నడు'అని కూతురివంకచూచి కదలకపోవడమువలన క్రుద్ధుడై రెండు లెంపకాయలు వేశాడు. అంత సీతమ్మ అడ్డువెళ్లి 'ఎదిగిన పిల్లని చెయ్యిచేసుకోవడమేమిటి?

మీరు తెలిసినవాళ్ళల్లా చేయుట బాగుండలేదు. పోరునష్టం; పొందులాభం. మీశాంతమంతా యేమైనది' అని అన్నది. భార్య అడ్డురావడంతోటే మండిపడి సత్యనారాయణ ఆవిడనికూడా చితకతన్నినాడు.

సీతమ్మ ఓర్పుతో వూరుకున్నది. కమల మాత్రమాలా వూరుకోలేకపోయినది. కొంచెమునే పాగి తండ్రిగదిలోకి వెళ్ళింది. కోపము తగ్గక మీసాలు కొరుక్కుంటూ పచారుచేస్తున్నతండ్రిని చూచి

"మీతో మాట్లాడాలని వచ్చాను" అని అంది.

"ఏమీ మాట్లాడ నవసరములేదు. నా యెదటికిరాక అవతలికిపో".

"వెడతానుగాని..." అని యింకా యేమో చెప్పబోవ 'అవతలికిపో' అని ఆమెను గెంటి తలుపువేసుకొని ఒకడూ కూర్చుండెను.

## ౪

భార్యాబిడ్డలు బాధపడలేక వారినందరిని సెలవుల పేరు చెప్పి రాజమహేంద్రవరము పంపి సత్యనారాయణ చెన్నపట్నములోనే యుండెను. ఈతూరి సెలవులకు ఇంటికిపోవలెనని యతడు తలంపలేదు. సీతమ్మ పుట్టింటివద్దనుంచి వ్రాసినయుత్తరము చదువుచు గదిలో పచారు చేయుచుండెను. అంతకు ముందే ఆండాళ్లు బల్లపై పెట్టిన పుస్తకపు పుటలు గాలికి దడదడ తిరిగి అందున్న యొక గిల్టు అంచుల లెటరుపేపరు క్రిందపడెను. పరధ్యానముతో నున్న సత్యనారాయణ దృష్టిని ఆ అంచు ఆకర్షింప నతడు దానిని పైకెత్తి యందు వ్రాయబడిన యుత్తరమును చదివెను. ఆండాళ్లింకొక ప్రియునకు సగము వ్రాసిన యుత్తరమది. అది చూచి సత్యనారాయణ బిక్కచచ్చి 'నేనెంత వెర్రిని.' అనుచు భార్యవ్రాసిన యుత్తరము తెరచి 'వావి వీడి మిమ్మెట్లు వలచినదో అట్ులే యితరులను గూడ వలచునన్న సంగతి కామోద్రేకమున మీరు మరచితిరి.' అని చదివి 'అవును. ఇదేమి? ఇంతకు ముందుగా నాపై ప్రేమ చిప్పిల బలుకుచు నీయుత్తరమును వ్రాసినది. ఛీ, నాయవివేకము నే మనవలె?' అనెను. 'రెండు దినములలో వచ్చెదను. జెగ్గింకు'మని భార్యకు వుత్తరము వ్రాసి పోస్టులో పడవేయుటకు సత్యనారాయణ వెళ్ళినాడు.

